


చామరాజనగర్ ఈద్గా మైదానంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్

బెంగళూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. 30రోజులపాటు ఉపవాసదీక్షలు చేసిన ముస్లింలు బుధవారం రాత్రి నెలవంక దర్శనమివ్వడంతో ఉపవాసదీక్షలు ముగించారు. పండుగ చేసుకోవచ్చునని మత పెద్దలు ప్రకటించారు. బెంగళూరు, మైసూరు హుబ్బళ్ళి, ధారవాడ, కోలారు, చిక్కబళ్ళాపుర, రామనగర, తదితర ప్రాంతాల్లో రంజాన్ సందడి కనిపించింది. ఉదయం 8 గంటలకే ముస్లింలు ఈద్గా మైదానాలకు చేరుకున్నారు. మతపెద్దలు ఖురాన్‌లోని పలు ఘట్టాలను చదివి వినిపించారు. రంజాన్ ప్రాధాన్యతను తెలిపారు. సామూహిక ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఎన్నికల వేళ ఈద్గా మైదానం వద్ద రాజకీయనాయకుల సందడి కనిపించింది. అనంతరం బంధుమిత్రులతో కలసి విందు చేసుకున్నారు. బెంగళూరులోని ఖుద్దూస్ ఈద్గామైదానం వద్ద వేలాదిమంది పాల్గొన్నారు. చామరాజపేటలోని ఈద్గా మైదానం వద్ద మంత్రి జమీర్ తదితరులు పాల్గొన్నారు.






ప్రార్థనల్లో చిన్నారులు

17న రాష్ట్రానికి పవన్ కల్యాణ్

● బీజేపీ నేతలకు మద్దతుగా ప్రచారం ● తెలుగు ఓటర్లను ఆకట్టుకునేందుకు కమలం నేతల యత్నం



బెంగళూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ప్రముఖ తెలుగు నటుడు, జనసేన పార్టీ వ్యవస్థాపకుడు పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. లోక్‌సభ ఎన్నికలు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఒక పరీక్షగా మారాయి. విస్తృత ప్రచారం, ఆకట్టుకునే విధానాలతో ఎక్కువసీట్లు సాధించాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇందులో భాగంగా తెలుగుమాట్లాడేవారు ఎక్కువగా ఉండే చిక్కబళ్ళాపుర, కోలారు, బళ్ళారి, రాయచూరు ప్రాంతాల్లో పవన్‌కల్యాణ్ రోడ్‌షో నిర్వహించాలని నిర్ణయించారు. ఏపీకి సరిహద్దున ఉండే జిల్లాల్లో పవన్ కల్యాణ్ ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. అందుకు అనుగుణంగానే ప్రచారానికి కార్యాచరణ చేస్తున్నారు. ఈనెల 17న రాయచూరుకు పవన్ రానున్నారు. ఉదయం 11 గంటలకు రాయచూరులో బెంజ్ సర్కిల్ నుంచి రోడ్‌షో ప్రారంభం కానుంది. బీజేపీ అభ్యర్థి రాజా అమరేశ్వరనాయక తరపున ప్రచారం చేయనున్నారు. అదే రోజున మధ్యాహ్నం బళ్ళారిలో రాయల్ సర్కిల్ నుంచి వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నారు. చిక్కబళ్ళాపుర, కోలారుతోపాటు మరిన్ని ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ సభకు సంబంధించి కార్యక్రమాలు రెండు రోజుల్లోనే ఖరారు కానున్నాయని తెలుస్తోంది.


నేటి నుంచి 2వ విడత నామినేషన్లు

● 14 స్థానాల్లో ప్రక్రియ ప్రారంభం

● కలబురగికి తరలనున్న ఖర్గే, డీసీఎం



బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల వేడి మరింత రాజుకుంటోంది. తొలి విడత ఈనెల 26న పోలింగ్ జరిగే 14 స్థానాలకు సంబంధించిన సంపూర్ణ ప్రక్రియ పూర్తి కాగా ప్రచారం హోరెత్తుతోంది. ఇక రెండో విడతగా 14 లోక్‌సభ స్థానాలకు జరిగే ఎన్నికల కీలకఘట్టమైన నామినేషన్ల దాఖలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. రెండో విడతలో చిక్కోడి, బెళగావి, బాగల్కోట, విజయపుర, కలబురగి, రాయచూరు, బీదర్, కొప్పళ, బళ్ళారి, హావేరి, ధారవాడ, ఉత్తరకన్నడ, దావణగెరె, శివమొగ్గ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల స్వీకరణ విధానం ఈనెల19వరకు జరుగనుంది. 20న నామినేషన్ల పరిశీలన జరుగనుండగా, 22వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. మే నెల 7న పోలింగ్ జరగనుంది. 14 స్థానాలలో విజయపుర, కల్బుర్గి నియోజకవర్గాలు ఎస్‌సీ రిజర్వు కాగా రాయచూరు, బళ్ళారి స్థానాలు ఎస్టీ రిజర్వుకు కేటాయించబడినవి. మిగిలిన పది స్థానాలు జనరల్ కోటాకు చెందినవే. రెండోవిడత ఎన్నికలు జరిగే 14 స్థానాలకు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించింది. రాష్ట్రంలో బీజేపీ- జేడీఎస్‌ల మధ్య పొత్తు ఉన్నా రెండోవిడత జరిగే 14 స్థానాలలో ఒక్క చోట కూడా జేడీఎస్‌కు కేటాయించలేదు. పూర్తిగా బీజేపీ అభ్యర్థులే ఉంటారు. రెండోవిడతలోనే కీలక నేతలు బరిలోకి దిగుతారన్నారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి ప్రహ్లాద్‌జోషి ధారవాడ నుంచి మరో కేంద్రమంత్రి భగవంత్‌ఖూబా బీదర్ నుంచి పోటీ చేస్తున్నారు. ఏఐసీసీ అధ్యక్షులు సొంత నియోజకవర్గం కలబుర్గి నుంచి ఆయన అల్లుడు రాధాకృష్ణ అభ్యర్థి కానున్నారు. కాగా ధారవాడ నుంచి దింగాలేశ్వర స్వామి పోటీకి సిద్ధం కావడంతో ప్రస్తుత ఎన్నికల ద్వారా రాష్ట్రం నుంచి ఓ స్వామీజీ ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు అవుతోంది. ఇక బీజేపీ సీనియర్‌నేత ఈశ్వరప్ప రెబల్‌గా మారి మరో అగ్రనేత యడియూరప్ప కుటుంబానికి సవాల్ విసరనున్నారు. ఈశ్వరప్ప శివమొగ్గ నుంచి శుక్రవారం నామినేషన్ వేస్తున్నట్లు ప్రకటించడంతో ఇక్కడ మరింత ఎన్నికల వేడి పెరిగినట్లు అవుతోంది. కాగా కలబురిగి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రాధాకృష్ణ నామినేషన్ శుక్రవారం వేస్తున్న తరుణంలో అగ్రనేతలు తరలివెళుతున్నారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే, డీసీఎం డీకే శివకుమార్‌తో పాటు పలువురు వెళుతున్నారు. మంత్రి ప్రియాంకఖర్గే వారం రోజులుగా అక్కడే మకాం వేసి మరీ ఏర్పాట్లు, ప్రచారం చేస్తున్నారు. మొత్తానికి తొలి విడత కన్నా రెండో విడతలో పలువురు ప్రముఖులు భాగస్వామ్యం కానున్నారు. వాడివేడి మాటలతో రాష్ట్రంలో రాజకీయం రగులుతున్న వేళ రెండో విడత నామినేషన్లు ప్రారంభం కావడంతో మరింత రాజకీయ వేడి రగలనుందని చెప్పవచ్చు. మరో వైపు మండే ఎండల్లోనూ నాయకులు చెమటలు కక్కుకుంటూ ప్రచారాలు హోరెత్తిస్తూ ఓటర్లను కలుస్తున్నారు.



రాహుల్ నాయకత్వం విఫలం : యడియూరప్ప



బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నాయకత్వం విఫలమయ్యిందని, నరేంద్ర మోదీ పదేళ్ల పాలనపై నిత్యం కాంగ్రె స్ నాయకులు విమర్శలు చేయడం ఆశ్చర్యం అని మాజీ సీఎం యడియూరప్ప ధ్వజమెత్తారు, గురువారం మీడియాతో మాట్లాడిన యడియూరప్ప బెంగళూరులోని హెచ్‌ఏఎల్‌ను మూసివేస్తారని ప్రచారం చేశారని, ప్రస్తుతం హెచ్‌ఏఎల్ 84వేల కోట్ల రూపాయల ఆర్డర్స్ పొందిందన్నారు. మరో 50వేల కోట్ల ఆర్డర్స్ కోసం చర్చలు జరుగుతున్నాయన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 29వేల కోట్ల రూపాయల ఆదాయం సాధ్యమైందని, హెచ్‌ఏఎల్‌పై ఆరోపణలు చేసిన రాహుల్ బహిరంగ క్షమాపణ చెబుతారా..? అం టూ నిలదీశారు. రాష్ట్రంలో సిద్దరామయ్య పాలనలో ఎన్ని ఉద్యోగాలు సాధ్యమయ్యాయని ప్రశ్నించారు. మంత్రి ఎంబీ పాటిల్, ప్రియాంక ఖర్గేలు ఎక్స్ ఖాతాలలో పరిశ్రమలు స్థాపించారన్నారు. 2014లో పీఎఫ్ ఖాతాలు 15.54 కోట్లు ఉండేవని, 2024 నాటికి 22.5 కోట్లకు పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నభాగ్యలో ప్రకటించిన 10 కేజీల బియ్యం సమకూర్చలేకపోయారన్నారు. రాష్ట్రంలో 54 లక్షలమంది రైతులకు కేంద్రం నుంచి కిసాన్‌సమ్మాన్ ద్వారా ఏడాదికి రూ.6వేలు సాధ్యమవుతోందన్నారు. తమ పాలనలో ప్రకటించిన రూ.4వేలను సిద్దరామయ్య కోత విధించారన్నారు. పది నెలల్లో ఒక మెడికల్ కాలేజ్ రాలేదని, కనీసం పీహెచ్‌సీ రాలేదన్నారు. దేశ విభజనగురించి మాట్లాడేవారిని, మతాల గురించి మాట్లాడేవారికి తగిన గుణపాఠం తప్పదన్నారు. మీడియా సమావేశంలో పార్టీ ఎన్నికల నిర్వహణా సమితి సంచాలకులు సునిల్‌కుమార్, మాజీ మంత్రి భైరతి బసవరాజ్, అధికార ప్రతినిధి అశ్వత్థనారాయణ పాల్గొన్నారు.

తొలివిడతలో 247 మంది అభ్యర్థులు

తొలి విడత ఎన్నికలు జరుగుతున్న 14 నియోజకవర్గాల నుంచి 247మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో 226మంది పురుషులు కాగా 21మంది మహిళలు ఉన్నారు. ఎన్నికల్లో తృతీయలింగ అభ్యర్థులు ఎవరూ లేరు. తొలివిడత ఎన్నికల్లో ఉడుపి-చిక్కమగళూరు 10 మంది అభ్యర్థులు, హాసన్ 15, దక్షిణకన్నడ 9, చిత్రదుర్గ 20, తుమకూరు 18, మండ్య 14, మైసూరు 18, చామరాజనగర 14, బెంగళూరు గ్రామీణ 15, బెంగళూరు నార్త్ 21, బెంగళూరు సెంట్రల్ 24, బెంగళూరు దక్షిణ 22, కోలారులో 18, చిక్కబళ్ళాపురలో అత్యధికంగా 29మంది బరిలో ఉన్నారు. గడిచిన ఎన్నికలతో పోలిస్తే మహిళా అభ్యర్థుల సంఖ్య పెరగడం సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది.




2.88 కోట్లమంది ఓటర్లు

తొలి విడత 14 నియోజకవర్గాలకు సంబంధించి 1,44,17,530మంది పురుష ఓటర్లు కాగా 1,43,87,585మంది మహిళలు, 3067 మంది థర్డ్ జెండర్ ఓటర్లతో కలిపి 2,88,08,182మంది ఉన్నారు. 85ఏళ్ల పైబడిన వారు 3,40,856మంది కాగా ఎన్ఆర్ఐ ఓటర్లు 2849, సర్వీస్ ఓటర్లు 11,160మంది, యువ ఓటర్లు 5,99,444మంది, దివ్యాంగులతోపాటు దీర్ఘకాల జబ్బులు తదితర సమస్యలు కల్గినవారు 2,76,042మంది, వివిధ విభాగాలకు చెందిన ఓటర్లు ఉన్నారు.



సురపుర ఎమ్మెల్యే ఎన్నికకు నేటినుంచి...

యాదగిరి జిల్లా సురపుర శాసనసభ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉప ఎన్నికకు శుక్రవారం నుంచి నామినేషన్‌లు ప్రారంభం కానున్నాయి. ఇదే స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఉన్న రాజా వెంకటప్ప నాయక అకస్మిక మృతితో ఉప ఎన్నిక జరుగుతోంది. ఈనెల 19వరకు నామినేషన్లు 20న పరిశీలనలు, 22న ఉపసంహరణ ఉంటాయి. మే 7న పోలింగ్ జరగనుండగా జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,579.07	1,577.40
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	171	2,865
సామర్థ్యం (టీఎంసీలు)	4.03	3.34

మహిళా సాధికారతే బీజేపీ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న భారతీశెట్టి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 11: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం ఎన్నో పథకాలు అమలు చేసిందని శాసనమండలి సభ్యురాలు భారతీశెట్టి తెలిపారు. నగరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ లోక్‌సభ నియోజకవర్గంలో 52శాతం మహిళా ఓటర్లు ఉన్నారని, దేశంలో మహిళలకు 33శాతం రిజ ర్వేషన్లు కల్పించాలని ప్రధాని మోదీ ప్రతిపాదించారన్నారు. వీధి వ్యాపారులకు తాకట్టు లేకుండా తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు, ముద్రా యోజనలో మహిళలకు 69శాతం రుణాలు ఇచ్చామన్నారు. మహిళల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేలా కృషి చేస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో శాసనమండలి సభ్యురాలు హేమలతానాయక్, కార్పోరేషన్ సభ్యురాలు సురేఖ మల్లన్‌గౌడ, జిల్లాధ్యక్షులు సుగుణ, భాగ్యలక్ష్మిపార్టీనాయకులు సుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములు గెలుపునకు నాంది పలుకుతాం



సమావేశంలో మాట్లాడుతున్న హేమయ్యస్వామి

కంప్లి, ఏప్రిల్ 11 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి శ్రీరాములు గెలుపు కోసం నాంది పలుకుతామని జేడీఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు హేమయ్యస్వామి పేర్కొన్నారు. జేడీఎస్, బీజేపీ కలిసిపోవడంతో తమ జేడీఎస్ కార్యకర్తలు కూడా బీజేపీ అభ్యర్థి శ్రీరాములుకు ఓట్లు వేసి గెలుపుకు నాందిపలుకుతారన్నారు. కొట్టాల్ రోడ్డులోని తుంగభద్ర నిలయం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బీజేపీ అధ్యక్షులు హళ్లి వీరేష్ మాట్లాడుతూ రేపు తమ నాయకుడు శ్రీరాములు నామినేషన్ వేస్తున్నారని, నియోజకవర్గం నుంచి భారీసంఖ్యలో బీజేపీ నాయకులు పాల్గొనాలని సూచించారు. ఇందులో రాష్ట్ర అధ్యక్షులు బీవై విజయేంద్ర కూడా పాల్గొననున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 17న జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ బళ్లారికి రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య, సిద్దప్ప, బూదిగుంప అంబన్న, పురుషోత్తమ్, వేమారెడ్డి, సుధాకర్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

25వ వార్డులో ప్రతి ఇంటికి తాగునీరు

సిరుగుప్ప, ఏప్రిల్ 11 : తాగునీటి ఎద్దడి నివారించేందుకు నగరసభ మాజీ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి ఫిల్టర్ నీటిని ప్రతి క్యాన్‌కు తన వంతుగా రూ. 5లు ఇచ్చి 25వ వార్డు విజయనగర కాలనీలో ప్రతి ఇంటికి తాగునీటిని సరఫరా చేశారు. ప్రజలు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా తాగునీటిని తీసుకున్నారు.

తల్లిదండ్రులకు విద్యార్థినుల లేఖలు

కంప్లి, ఏప్రిల్ 11 : హోస్పేటలోని జంబునాథ రోడ్డు వద్ద వున్న బాలికల హాస్టల్ విద్యార్థినులు తల్లిదండ్రులకు లోక్‌సభ ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలని లేఖలు రాశారు. రాజ్యాంగం 18 సంవత్సరాల నిండిన ప్రతిఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని రాసి తమ తల్లిదండ్రులకు పోస్టాఫీసు ద్వారా పంపించారు.



లేఖలు చూపుతున్న విద్యార్థినులు

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



ముస్లింలను ఆలింగనం చేసుకుంటున్న శ్రీరాములు



రూపనగుడి ఈద్గామైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఈద్ ముబారక్ బెహెన్!

రంజాన్ శుభాకాంక్షలు చెపుకొంటున్న చిన్నారులు



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్



ప్రార్థనల్లో మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు



మహ్మద్ రఫీక్ కుటుంబ సభ్యులతో మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, తుకారాం



ఈద్గామైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మహమ్మద్ రఫీక్‌ను ఆలింగనం చేసుకుంటున్న కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్

బళ్లారి, విజయనగర జిల్లాల్లో గురువారం రంజాన్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన వారు బుధవారం సాయంత్ర నెలవంక కనిపించడంతో గురువారం రంజాన్ పండుగ చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ముస్లిం గురువులు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయగా తక్కినవారు వారిని అనుసరించారు. ఒకరినొకరు ఆలిం గనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బళ్లారిలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి బి. నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీరాములు, మాజీ బుడా అధ్యక్షుడు పాలన్న తదితరులు ముస్లింలకు శుభాకాంక్షలు చెప్పారు. అలాగే విజయనగర, సండూరు, సిరుగుప్ప, కంప్లి, తదితర తాలూకాల్లో ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. - బళ్లారి, సిటీ, రూరల్, కంప్లి, తోరణగల్లు, సిరుగుప్ప

నేటి నుంచి నామినేషన్లు

ఏప్రిల్ 19వరకు నామినేషన్ల స్వీకరణ, 20న పరిశీలన, 22న ఉపసంహరణ, మే 7న పోలింగ్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 11: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. డీసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 12నుంచి ఏప్రిల్ 19వరకు నామినేషన్ పత్రాలను సమర్పించవచ్చునన్నారు. 20వ తేదిన పత్రాల పరిశీలన జరుగుతుందని, నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 22 చివరి రోజుగా ప్రకటించారు. మే 7న ఓటింగ్ జరగనుందన్నారు. నియోజకవర్గంలో 18,77,751 మంది ఓటర్లు ఉన్నారని వారికి 1972 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ. 9.32 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు

చైతన్య కళాశాలకు ర్యాంకుల పంట



బళ్లారి సిటీ, ఏప్రిల్ 11: ద్వితీయ పియూసీ పరీక్షల్లో నగరానికి చెందిన శ్రీ చైతన్య విద్యాసంస్థ విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. సయ్యద్ ఫైజాన్ 593/600, అనుశ్రీ 591, సంపద సురేశ్ మలగుండే 589, రఫిక్ 587, సమరిన్ 586, సంతోష్ కుమార్ 585, లక్ష్మి 585, పూజిత 584, నందిత చంద్రశేఖర్ 584, పవార్ 584, అశ్విని 584, అభినవ్ 584,హర్షిత 583, నితిస్ 583, నిసర్గ 583, వైష్ణవి దేశ్‌పాండే 583, సుదీప్ పాటిల్ 583 మార్కులు సాధించారు. అధికమార్కులతో కాలేజీకి కీర్తితీసుకొచ్చిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ డైరెక్టర్ రాధాకృష్ణ అభినందించారు.

బీజేపీలో మహిళలకు పెద్దపీట: గాలి లక్ష్మీఅరుణ

బళ్లారి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బీజేపీ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశంలో ఉన్న మహిళలకు పెద్ద పీఠం వేశారని బీజేపీ మహిళ నాయకురాలు గాలి లక్ష్మి అరుణ పేర్కొన్నారు. గురువారం బళ్లారిలోని బసవ బవన్‌లో బళ్లారి, విజయనగర జిల్లాల బీజేపీ మహిళ సంఘం నేతృత్వంలో మాతృ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల మహిళ పరిశీలకురాలు, ఎమ్మెల్సీ భారతీ శెట్టి, కొప్పళ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ హేమంత నాయక్, మహిళ నాయకురాలు, గాలి లక్ష్మి అనుణ, జిల్లా బీజేపీ మహిళలు, లతో పాటు బీజేపీ పార్టీ ఎంపీ అభ్యర్థి శ్రీరాములు, జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనహళ్లి తాయన్న హజరయ్యారు. ఈసందర్భంగా ముందుగా గాలి లక్ష్మి అరుణ మాట్లాడారు. బీజేపీ పార్టీ మహిళకు అన్ని రకాలుగా అండగా ఉందని బీజేపీ ప్రభుత్వం హయాంలోనే దేశంలో మహిళలకు రక్షణ ఉందన్నారు. 'దేశానికి మోదీ కావాలి, మనకు మోదీ కావాలి' అని అన్నారు. వీరితో పాటు విజయనగర, బళ్లారి జిల్లాలకు చెందిన బీజేపీ మహిళా నేతలు, నాయకులు తదితరలు పాల్గొన్నారు.



బీజేపీ నిర్వహించిన మాతృమూర్తుల సమావేశంలో పాల్గొన్న మహిళలు

ఎన్నికలను బహిష్కరిస్తాం: రైతులు



కురుగోడులో పట్టాల కోసం ధర్నా చేస్తున్న రైతులు

కంప్లి, ఏప్రిల్ 11 : రానున్న లోక్‌సభ ఎన్నికలను బహిష్కరిస్తామని కర్ణాటక ప్రాంత రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీఎస్ శివశంకర్ తెలిపారు. కురుగోడు పట్టణంలో మల్లప్ప చెరువులో సాగు చేసిన రైతులకు పట్టాలు ఇవ్వాలని 140 రోజులుగా నిరసనలు చేపడుతున్నా ఏ అధికారి గానీ, ప్రజాప్రతినిధులు గానీ స్పందించలేదన్నారు. 204 కుటుంబాలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజాప్రభుత్వంలో రైతులకు అన్యాయం జరుగుతున్నా రైతులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రుద్రప్ప మాట్లాడుతూ సుమారు మూడు తరాలుగా చెరువులో సేద్యం చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. ఇప్పటికైనా పట్టాలు ఇవ్వాలని రైతులు నిరసన చేస్తున్నా రైతుల పట్ల ఎలాంటి దయ చూపడం లేదన్నారు. అందువల్ల ఈ ఎన్నికలను రైతు కుటుంబాలు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గాలి బసవరాజు, సోమప్ప, శంకరప్ప, ఊలెప్ప, భీమయ్య, హనుమంతప్ప, కమలమ్మ, దొడ్డ బసమ్మ, గంగమ్మ, కాడమ్మ, కెంచప్ప, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి



అడలిగి ఇటిగి వద్ద కాంగ్రెస్ సమావేశాన్ని ప్రారంభిస్తున్ననాయకులు

కంప్లి, ఏప్రిల్ 11 : రాష్ట్రంలోను, కేంద్రంలోను కేవలం కాంగ్రెస్ పార్టీ వల్లే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రులు పరమేశ్వరనాయక్ తెలిపారు. బుధవారం విజయనగర జిల్లా హవిన అడగలి, ఇటిగి బ్లాక్ కాంగ్రెస్ సమితిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఈ తుకారామ్ భారీ మెజార్టీతో గెలుపొందుతారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలే తమ అభ్యర్థికి గెలుపునిస్తాయని తెలిపారు. అనంతరం అభ్యర్థి తుకారామ్ మాట్లాడుతూ తమకు హైకమాండ్ అవకాశాన్ని కల్పించిందని, తమను ఓటమి పాలు చేయాలని ఎవరు ప్రయత్నాలు చేసినా క్షేత్ర ప్రజలు తమ వెన్నంటే ఉంటూ నాలుగుసార్లు తమకు గెలుపునిచ్చారని తెలిపారు. వారితో పాటు సిరాజ్ షేక్, కేశవస్వామి, శివయోగి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హనుమంతప్ప, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

అంగరంగ వైభవంగా బాగలూరు రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న వేలాది భక్తులు

హోసూరు ఏప్రిల్ 11 : హోసూరు సమీపంలోని బాగలూరు గ్రామంలో వెలసిన కోట మారియమ్మ రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. 15 వ శతాబ్దంలో బాగలూరును తన ప్రధాన కేంద్రంగా పరిపాలించిన రామనాయకన్ అనే రాజు హోసూరులోని కోట మారియమ్మ ఆలయంలో పూజలు చేసేవాడని, ఆపై బాగలూరు గ్రామంలో పూజలు చేసేందుకు కోటమారియమ్మను స్థాపించి పూజలు నిర్వహిస్తుండేవాడని చెబుతున్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం చైత్ర మాసంలో రథోత్సవం జరుపుకుంటారు. ఏప్రిల్ 9 నుంచి 16 వ తేది వరకు వారం రోజుల పాటు బాగలూరు కోట మారియమ్మ ఉత్సవాలు జరుగుతాయి. ఉత్సవాల ప్రధాన కార్యక్రమం గురువారం జరిగింది. వేలాది మంది భక్తులు రథాన్ని లాగి పూజలు చేశారు. ఉత్సవాల్లో చైన్ స్నాచింగ్‌తో పాటు దోపిడీలు జరగకుండా బాగలూరు పోలీసులు, మహిళా పోలీసులు భారీ బంతోబస్తులో నిఘా ఉంచారు. హోసూరు డీఎస్పీ బాబు ప్రసాంత్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యల్లో పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అమ్మవారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

టీవీఎస్ చెక్‌పోస్టు వద్ద ముమ్మరంగా తనిఖీలు

హోసూరు(మత్తిగిరి) ఏప్రిల్ 11 : కృష్ణగిరి పార్లమెంటరీ నియోజకవర్గానికి 19 వ తేదిన పోలింగ్ జరుగనుందని, ఈ పరిస్థితిలో ఎన్నికల స్క్వాడ్ అధికారులు టీవీఎస్ చెక్‌పోస్టు, జూజూవాడి, కగ్గనూరు వద్ద 24 గంటలూ ముమ్మరంగా పర్యవేక్షిస్తున్నారు. అందివాడి, పూనపల్లి సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద అన్ని వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. బెంగళూరు, కర్ణాటక నుంచి హోసూరు మీదుగా తమిళనాడు వెళ్లే అన్ని వాహనాలను ఆపి తనిఖీ చేసిన తర్వాతే తమిళనాడులోకి అనుమతిస్తారు. గురువారం టీవీఎస్ చెక్‌పోస్టు వద్ద స్క్వాడ్ అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా బెంగళూరు నుంచి హోసూరుకు వస్తున్న కారును ఆపి తనిఖీ చేశారు. అందులో 50 గ్రాముల రెండు బంగారు పట్టీలు ఉన్నాయని తేలింది. దీనికి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో హోసూరు స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకుని సబ్ కలెక్టర్ ప్రియంకాకు అప్పగించారు. దానిని ట్రెజరీకి అప్పగించాలని ఆదేశించారు.



తనిఖీల్లో బంగారం స్వాధీనం చేసుకున్న అధికారులు

వంద శాతం ఓటింగ్ కోసం అవగాహన


హోసూరు ఏప్రిల్ 11 : పార్లమెంటరీ ఎన్నికల్లో 100 శాతం ఓటింగ్ గురించి నొక్కి చెప్పాలని కృష్ణగిరి జిల్లాలోని బెత్తలపల్లి, మద్దూరు జిల్లాలోని రంగంపట్టి గ్రామంల్లో వ్యవసాయ శాఖ అధికారులు ప్రజలకు తెలిపారు. కృష్ణగిరి జిల్లా శూలగిరి బస్టాండ్ వద్ద ఓటరు అవగాహన వాహనంలో అవగాహన వీడియోను ప్రదర్శించారు. పార్లమెంటరీ ఎన్నికల్లో 100 శాతం ఓటింగ్ గురించి నొక్కి చెబుతూ హోసూరు ఏరియాల్లోని వేలంకన్ని హైస్కూల్ సమిపంలోని పార్కును సందర్శించి ప్రజలకు రెవిన్యూ అధికారులు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఓటు అవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్

● సామూహిక ప్రార్థనలతో హోరెత్తిన ఈద్గా మైదానం

రాయచూరు, ఏప్రిల్ 11 : ఈద్-ఉల్-ఫితర్ పవిత్ర రంజాన్(ఈద్-ఉల్-ఫితర్) పండుగను ముస్లిం సోదరులు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించారు. 30 రోజుల ఉపవాస దీక్ష అనంతరం జరుపుకునే రంజాన్ సందర్భంగా నగరంలోని ఈద్గా మైదానం వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. సామూహిక ప్రార్థనల కోసం ఉదయం 8 గంటల నుంచే మైదానంలో భక్తుల రద్దీ అధికం కావడంతో ఈ రహదారి గుండా హైదారాబాద్ వైపు వెళ్లే వాహనాలను ఇతర మార్గంలోకి మళ్లించారు. ప్రార్థనలు ముగిసిన అనంతరం పరస్పరం అభినందనలు తెలుపుకున్న ముస్లింలకు పలువురు ప్రముఖులు, రాజకీయ నేతలు శుభాకాంక్షలు అందజేశారు. ప్రార్థనల్లో పాల్గొన్న వారిలో రాయచూరు లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి జీ కుమార్ నాయక్, మాజీ ఎమ్మెల్యే సయ్యద్ యాసీన్, మహ్మద్ శాలం, కాంగ్రెస్ నేతలు రవి భోసరాజ్ తదితరులు ఉన్నారు.

17న రాయచూరులో పవన్ కల్యాణ్ రోడ్ షో



రాయచూరు, ఏప్రిల్ 11 : జనసేన పార్టీ అధ్యక్షుడు తెలుగు సినీ నటుడు పవన్ కల్యాణ్ ఈనెల 17న రాయచూరు నగరంలో రోడ్ షో నిర్వహించనున్నారు. లోకసభ ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ ఈ నెల 12న ప్రారంభం కానున్న నేపథ్యంలో 17న జిల్లాకు రానున్న పవన్ కల్యాణ్ స్థానిక కనకదాస్ సర్కిల్ నుంచి రోడ్ షోను ప్రారంభించి ప్రధాన రహదారుల గుండా సాగి స్థానిక బీఆర్‌బీ సర్కిల్ అంబిగర చౌడయ్య విగ్రహం వద్ద ముగిస్తారని బీజేపీ నాయకుడు బాబురావ్ గురువారం తెలిపారు. కాగా 17వ తేదీ ఉదయం 10:30 గంటలకు యరమరస్ సర్క్యూట్ హౌస్ దగ్గరకు హెలిక్యాప్టర్‌లో రానున్న పవన్‌కల్యాణ్ రోడ్‌షో అనంతరం అక్కడికి దగ్గరలోని హెలిప్యాడ్‌కు చేరుకుని బళ్లారికి వెళతారని తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. ఐదుగురికి గాయాలు

రాయచూరు, ఏప్రిల్ 11 : నగర సమీపంలోని అస్కిహాళ్‌లో గురువారం ఉదయం ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. రెండు రోజుల క్రితం జరిగిన ఒక రోడ్డు ప్రమాదానికి సంబంధించి ఇరు వర్గాల మధ్య ఇప్పటికే రాజీ ప్రయత్నం జరగగా అందుకు కొనసాగింపుగా జరిగిన చర్చల్లో భాగంగానే రెండు వర్గాలు ఘర్షణకు దిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఘర్షణకు దిగిన ఇరు వర్గాల్లో ఒక వర్గం చాకులు, బెత్తాలు, రాడ్స్‌తో దాడికి దిగగా ప్రత్యర్థి వర్గానికి చెందిన ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. విషయం గురించి తెలుసుకున్న వెస్ట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శాంతమూర్తి తన సిబ్బందితో కలిసి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్యర్థి వర్గానికి చెందిన 8 మందిపై కేసు నమోదు చేశారు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

మోక్షగుండం విశ్వేశ్వరయ్య (వర్ధంతి)




భావి ఇంజనీర్లకు స్ఫూర్తిగా నిలిచిన దేశం గర్వించదగిన ఇంజనీర్ 'భారతరత్న' గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1861 సెప్టెంబరు 15న కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపుర తాలూకా ముద్దేనహళ్లిలో జన్మించారు. వీరి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా మోక్షగుండం గ్రామానికి చెందినవారు. 1915లో మైసూరు దివానుగా ప్రజల మన్నన పొందే కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణరాజ సాగర్ (కేఆర్ఎస్) డ్యామ్‌కు చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారు. మైసూరు విశ్వవిద్యాలయం నెలకొల్పడంలో విశేషకృషి చేశారు. హైదరాబాద్ నగరాన్ని వరదలనుంచి రక్షించేలా వ్యవస్థను, విశాఖపట్నం ఓడరేవుకు సముద్రపు కోతనుంచి రక్షించే వ్యవస్థలోనూ, తిరుమల తిరుపతి ఘాట్ రోడ్డు నిర్మాణంలో కీలకపాత్ర వహించారు. 101వ యేట 1962 ఏప్రిల్ 12న కన్నుమూశారు.

కుమారన్ ఆశాన్ (జయంతి)



మహాకవి ఎన్ కుమారన్ ఆశాన్ 1873 ఏప్రిల్ 12న కేరళ రాష్ట్రం ట్రావెన్‌కోర్ ప్రాంతంలో జన్మించారు. నారాయణ గురు శిష్యుడిగా రాణించారు. సామాజిక సంస్కర్తగా తత్వవేత్తగానే కాక 20వ శతాబ్దం తొలినాళ్లలో మళయాళ సాహిత్యానికి కొత్త పుంతలు తెచ్చినవారుగా పేరొందారు. అలాగే సుబ్రమణ్య శతకం, శంకర శతకం వంటి రచనలు, పద్యాలు పేరొందాయి. 1924 జనవరి 16న కన్నుమూశారు. ఆయన జ్ఞాపకార్థం 1973లో పోస్టల్ స్టాంపు విడుదల చేశారు.

వినూ మన్కడ్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత ముల్వంత్ రాయ్ హిమ్మత్‌లాల్ వినూ మన్కడ్ 1917 ఏప్రిల్ 12న గుజరాత్ రాష్ట్రం జామ్‌నగర్‌లో జన్మించారు. క్రికెటర్‌గా అంతర్జాతీయ స్థాయిలో తనదైన గుర్తింపు పొందారు. 1956లో ఓపెనింగ్ పార్ట్‌నర్‌షిప్‌గా పంకజ్ రాయ్‌తో కలసి 413 పరుగులు చేశారు. 52 ఏళ్లపాటు రికార్డుగా నిలిచింది. 44 టెస్ట్ మ్యాచ్‌లలో ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా ఆడారు. 5 టెస్టు సెంచరీలు, 162 వికెట్‌లు పొందారు. 1978 ఆగస్టు 21న కన్నుమూశారు. ఆయన గౌరవార్థం ముంబైలోని వాంఖడే స్టేడియం సమీపాన ఒక రోడ్డుకు మన్కడ్ పేరు పెట్టారు.

ఎఫ్ఎన్ సౌజా (జయంతి)



ఫ్రాన్సిస్ న్యూటన్ సౌజా 1924 ఏప్రిల్ 12న గోవాలో జన్మించారు. గొప్ప కళాకారుడిగా పేరొందారు. ముంబైకు చెందిన ప్రొగ్రెసివ్ ఆర్ట్స్ గ్రూప్ సంస్థాపక సభ్యుడు. స్వాతంత్ర్యానంతరం దేశ కళాకారులలో ఒకరిగా గుర్తింపు పొందారు. 1960 దశకంలో అక్రిలిక్ కళాఖండాలను గీసిన తొలి భారతీయుడిగా పేరొందారు. ఆయన గీసిన కళాఖండాలు ప్రపంచవ్యాప్తంగా పలు మ్యూజియంలలో ప్రదర్శనలో ఉన్నాయి. 2002 మార్చి 28న కన్నుమూశారు.

మైసూరులో కాంగ్రెస్‌కు షాక్

● పార్టీకి సీఎం ఆప్తుడు గురుపాదప్ప గుడ్‌బై ● హస్తం వైపు చూడని ఎంపీ శ్రీనివాసప్రసాద్

బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న మైసూరు జిల్లాలో ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు షాక్‌లు తగులుతున్నాయి. సీఎంకు అత్యంత ఆప్తుడిగా పేరొందిన గురుపాదప్ప పార్టీకి గుడ్‌బై చెప్పారు. సీఎం సొంత నియోజకవర్గం వరుణలో లింగాయత సమాజానికి చెందిన గురుపాదప్ప ప్రతిభావంతమైన వ్యక్తి చాముండేశ్వరితో పాటు మైసూరు, చామరాజనగర్ జిల్లాలోను ఆయన ప్రభావం ఉంది. కొన్నేళ్ళకాలంగా కాంగ్రెస్‌కు విశ్వాసం కలిగిన నాయకుడిగా వ్యవహరించారు. ఆయనను బీజేపీలోకి చేర్చుకోవడం ద్వారా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విజయేంద్ర ఏకంగా ముఖ్యమంత్రికి సవాల్ విసిరినట్లు అయ్యింది. గురుపాదప్ప మైసూరు లోక్‌సభ స్థానం కోసం తీవ్రంగా ప్రయత్నించారు. కానీ పార్టీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్న ఎం.లక్ష్మణ్‌కు టికెట్ కేటాయించిన తర్వాత పోటీలో ఉండే వారి పట్ల కనీస రీతిలో కూడా చర్చించకపోవడమే ఆయన ఆగ్రహానికి కారణమని తెలుస్తోంది. ఇదే విషయమై గురుపాదప్ప మీడియాతో మాట్లాడుతూ మైసూరు టికెట్ కోసం ప్రయత్నించామని అందరికీ టికెట్ ఇవ్వలేరని కానీ ప్రయత్నించిన వారితో సీఎం సిద్దరామయ్య మాటమాత్రంగా కూడా చర్చించలేదన్నారు. గట్టిగా మాట్లాడేవారికే గౌరవమా అంటూ ప్రశ్నించారు. 45 ఏళ్ళుగా కాంగ్రెస్‌లోనే ఉన్నానని కానీ తమ పట్ల నిర్లక్ష్యాన్ని ఎంతకాలం సహించాలన్నారు. ఇదే కారణంతోనే పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. కాగా చామరాజనగర్ సిట్టింగ్ బీజేపీ ఎంపీ శ్రీనివాసప్రసాద్ అల్లుడికి టికెట్ దక్కకపోవడంతో అసంతృప్తికి లోనయ్యారు. ఇదే అవకాశంగా భావించిన మంత్రి మహదేవప్ప కుమారుడు అభ్యర్థి సునిల్‌బోస్‌తో కలిసి నేరుగా ఎంపీ ఇంటికి వెళ్ళి ఆశీస్సులు పొందారు. ఎన్నికల్లో సహకరించాలని కోరారు. అయితే ఎటువంటి సమాధానం చెప్పకపోయినా శ్రీనివాసప్రసాద్ కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం సాగింది. ఆయన మద్దతు ఇస్తే చామరాజనగర్‌లో సునాయాసంగా గెలుపు సాధించవచ్చునని కాంగ్రెస్ నాయకులు భావించారు. కానీ శ్రీనివాసప్రసాద్ మాత్రం బీజేపీ ఎంపీగా ఉన్నానని మరొకరికి మద్దతు ఇవ్వలేనని తేల్చిచెప్పారు. బీజేపీ టికెట్ ఇవ్వడంతో పాటు పలు సందర్భాల్లో ప్రత్యేక గౌరవం ఇచ్చిందని కాపాడుకోవాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. దీంతో శ్రీనివాసప్రసాద్ మద్దతు లభించలేదు.



ఎంపీ శ్రీనివాసప్రసాద్

సీటీ రవికి అన్యాయం..

బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో సీటీ రవికి అన్యాయం జరిగిందని ఎమ్మెల్సీ అవకాశం ద్వారా సర్దుబాటు చేస్తామని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు యడియూరప్ప తెలిపారు. గురువారం చిక్కమగళూరు జిల్లా కడూరు తాలూకా సక్కరాయపట్టణ ప్రచారసభలో యడియూరప్ప మాట్లాడుతూ శాసనసభలో గర్జించాల్సిన వారు బయట ఉన్నారన్నారు. సీటీ రవి మాట్లాడుతూ.. శాసనసభ ఎన్నికల్లో తమ నాయకులే తప్పుడు ప్రచారం చేశారని, అదే తన ఓటమికి కారణమన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. దావణగెరె జిల్లా న్యామతి తాలూకా చిన్నికట్టి గ్రామ పరిధిలో ఓమ్నీ వ్యాన్‌ను వేగంగా వచ్చిన కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గురువారం జరిగిన ప్రమాదంలో నంజుండప్ప(83) రాకేష్‌ఖ(27), దేవరాజ్(30) మృత్యువాత పడ్డారు. వీరు ముగ్గురు శివమొగ్గ గ్రామీణ తాలూకా హారమఘట్ట గ్రామానికి చెందినవారు. కేఎస్ఆర్టీసీ బస్సు శికారిపుర వైపు నుంచి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఓమ్నీ కారును ఢీ కొంది. ప్రమాదం జరిగినప్పుడు వ్యాన్‌లో ఆరుగురు ఉన్నారు. బస్సు ఢీకొనడంతో వ్యాన్ నుజ్జునుజ్జు అయ్యింది. ముగ్గురి శరీరాలు ఛిద్రమయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన శివమొగ్గ మెగ్గాన్ ఆసుపత్రికి తరలించారు. వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. న్యామతి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు

బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్యే శివరామహెబ్బార కుమారుడు వివేక్‌హెబ్బార కాంగ్రెస్‌లో చేరారు. గురువారం ఉత్తరకన్నడ జిల్లా శిరసిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వివేక్ హెబ్బార కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కేపీసీసీ ఉపాధ్యక్షులు ఐవాన్ డిసౌజా, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సాయినాథ్ గాంవకర్‌లు వివేక్‌ను సాదరంగా స్వాగతించారు. వివిధ గ్రామ పంచాయతీల అధ్యక్షులు, వార్డు సభ్యులతో పాటు అతడి మిత్రులు కాంగ్రెస్‌లో చేరారు. శివరామహెబ్బార ఒకప్పుడు కాంగ్రెస్‌లోనే ఉండేవారు. 2019లో రాజకీయ మార్పుల వేళ బీజేపీలో చేరి ఆతర్వాత మంత్రి అయ్యారు. ఇటీవల ఎన్నికలలో బీజేపీ నుంచే యల్లాపుర స్థానం నుంచి గెలుపు సాధించినా కొన్ని నెలల కాలంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ముందుగా కుమారుడిని పార్టీలో చేర్చారు.

కాంగ్రెస్‌లో చేరిన పాత్రికేయుడు

సీనియర్ పాత్రికేయుడు దీపక్ తిమ్మయ్య కాంగ్రెస్‌లో చేరారు. గురువారం రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు డీకే శివకుమార్ సమక్షంలో దీపక్ పార్టీలో చేరారు. ఇదే సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ దీపక్‌తో మూడుదశాబ్దాలుగా పరిచయం ఉందన్నారు. సంస్థ ద్వారా యువతలో నైపుణ్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందించే కృషిచేస్తున్నారన్నారు. దీపక్ కాంగ్రెస్‌లో చేరడం సంతోషమన్నారు. కేపీసీసీ రాజకీయ కార్యదర్శితో పాటు మీడియా సలహాదారుడి హోదా కల్పిస్తున్నామన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాల పట్ల నమ్మకంతో మెలిగారన్నారు. ఎంతోకాలంగా రాజకీయాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమాల విషయమై కూడా సలహాలు ఇచ్చారన్నారు.



దీపక్ తిమ్మయ్యను స్వాగతిస్తున్న డీకే శివకుమార్

పోలింగ్ కేంద్రం మార్చవద్దని వినతి

మహదేవపుర, ఏప్రిల్ 11: ఇప్పటికే అధికారులు గుర్తించిన నిర్ణీత స్థలంలోనే పోలింగ్ బూత్ కేంద్రాన్ని కొనసాగించాలని, మార్పు చేయరాదని కేఆర్‌పుర శాసనసభ నియోజకవర్గంలోని 52వ వార్డు వాసులు కోరారు. స్థానికంగా ఉన్న పోలింగ్ కేంద్రాన్ని మార్పు చేయాలన్న అధికారుల ఆలోచనపై స్థానికులంతా కలసి అధికారులకు గురువారం వినతిని సమర్పించారు. అజిత్ లే అవుట్, ప్రభాకరరెడ్డి, లే అవుట్, ఆర్ఎంఎస్ లే అవుట్, బనశంకరి లే అవుట్, విజయ లే అవుట్, సుభాష్ నగర్ తదితర ప్రాంతాల వాసులు పాల్గొన్నారు. ఇప్పటికే నిర్ణయించిన పోలింగ్‌బూత్‌ను సుమారు 5 కిలో మీటర్ల దూరంలోని మరో ప్రాంతానికి తరలించాలన్న అధికారుల ఆలోచనను విరమించుకోవాలన్నారు. మార్పు చేయదలిచిన పోలింగ్ కేంద్రానికి వెళ్లాలంటే ప్రధాన రహదారిని దాటాల్సి ఉంటుందని అది ఎంతో శ్రమతో కూడినదన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు పెద్దసంఖ్యలో ఉన్న ఈ బూత్ ప్రాంతాన్ని మార్పు చేయడం సరికాదని కోరారు. ఈ సందర్భంగా వెంకటేశ్, వీరభద్రప్ప, కుమార్, వసంతకుమార్, నారాయణస్వామి, రాజు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు

ఆదిచుంచనగిరి మఠాన్ని విభజించిందెవరు..?

● మాజీ సీఎం కుమారస్వామిపై మంత్రి చలువరాయస్వామి ధ్వజం

బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆదిచుంచనగిరి మఠాన్ని విభజించింది ఎవరని మంత్రి చలువరాయస్వామి ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ, వ్యక్తిగత, ఆధ్యాత్మిక, గతంలో కొనసాగిన పలు అంశాలపైనా విమర్శలు పెరుగుతున్నాయి. ఆదిచుంచనగిరి మఠం చుట్టూ రాజకీయం కొనసాగింది. బీజేపీ, జేడీఎస్ అభ్యర్థులు ఆదిచుంచనగిరి మఠానికి బుధవారం సందర్శించి ఆశీస్సులు పొందాక డీసీఎం డీకే శివకుమార్ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఒక్కలిగ సీఎంను కిందికు దించినవారు ఎవరన్నది స్వామీజీ ప్రశ్నిస్తారా..? అంటూ డీసీఎం ఆరోపించారు. అందుకు బీజేపీ నేత అశోక్, జేడీఎస్ నేత కుమారస్వామి తీవ్రంగా స్పందించారు. తాజాగా వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి రామనగరలో మీడియాతో మాట్లాడుతూ మరో అడుగు ముందుకేశారు. ఒక్కలిగల ముఖ్యమఠం ఆదిచుంచనగిరి మఠాన్ని విభజించినవారు ఎవరని ప్రశ్నించారు. కుమారస్వామి పాలనలో నిర్మలానందనాథ స్వామీజీ ఫోన్ ట్యాపింగ్ చేశారని, ఇప్పుడు ఆశీస్సులు పొందేందుకు వెళ్లారని మంత్రి ఎద్దేవా చేశారు. జేఎస్ఎస్, సిద్ధగంగా, ఆదిచుంచనగిరి మఠాలకు తాను వెళ్తానని, ఎన్నికల వేళ ఆశీస్సులకోసం అందరూ వెళ్తారని అదేమీ తప్పు కాదన్నారు. అయితే బాలగంగాధరనాథస్వామిజీని వేధించినవారు ఎవరనేది అందరికీ తెలుసునన్నారు. ఇప్పుడు ఆశీస్సులంటూ మఠం చుట్టూ తిరుగుతున్నారన్నారు. కాగా కాంగ్రెస్‌కు చెందిన మళవళ్ళి ఎమ్మెల్యే నరేంద్రస్వామి గురువారం మీడియాతో మాట్లాడుతూ ఒక్కలిగలలో ఎంతమందిని అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఇంతకూ మీరు ఒక్కలిగలేనా అంటూ విరుచుకుపడ్డారు. ఒక్కలిగ నేత ఎస్ఎం కృష్ణ రెండోసారి సీఎం కాకుండా అడ్డుకుంది ఎవరన్నారు. మండ్య కాంగ్రెస్ అభ్యర్థి స్టార్ చంద్రుపై ఎటువంటిపై ఆరోపణలు లేవన్నారు. అయితే పనిగట్టుకుని విమర్శలు చేస్తున్నారన్నారు. ఎన్నికలు వస్తూనే ఒక్కలిగల గురించి మాట్లాడతారని ఆ తర్వాత పట్టించుకోరని మండిపడ్డారు.



తాలూకా టాపర్లకు సన్మానం

శిడ్లఘట్ట, ఏప్రిల్ 11: ద్వితీయ పీయూ ఫలితాల్లో సైన్స్, కామర్స్ విభాగాల్లో అక్షర పీయూ కళాశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటుకున్నారు. సైన్స్ విభాగంలో పల్లవి 587 మార్కులతో తాలూకా టాపర్‌గా నిలిచారు. కామర్స్ విభాగంలో అక్షర పీయూ కళాశాలకు చెందిన కే మానస 586, బీజీఎస్ పీయూ కళాశాలకు చెందిన ఎస్ స్వాహా 586 మార్కులు సాధించడంతో టాపర్లను ఆత్మీయంగా అభినందించి సత్కరించారు. కళాశాల పాలకవర్గం మంజునాథరెడ్డి, ప్రకాశ్‌లు మాట్లాడుతూ సైన్స్ విభాగంలో 22మంది డిస్టింక్షన్, కామర్స్ విభాగంలో 23మంది డిస్టింక్షన్ సాధించారన్నారు. కన్నడలో ఇద్దరు, రసాయన శాస్త్రంలో ముగ్గురు, గణితంలో ఒక్కరు, జీవశాస్త్రంలో నలుగురు, కంప్యూటర్ సైన్స్‌లో ఇద్దరు వందశాతం మార్కులు సాధించారన్నారు. టాపర్‌లు నిలిచిన పల్లవి, మానస మాట్లాడుతూ ఏ రోజు పాఠాలు అదే రోజునే అభ్యాసం చేయడం, అధ్యాపకుల ప్రోత్సాహమే చక్కటి మార్కుల సాధనకు కారణమన్నారు. ఈ సందర్భంగా మంజునాథ రెడ్డి, మంజునాథ్, ప్రకాశ్, సునిల్‌కుమార్, గజేంద్ర, సుమంత్, సైన్స్, కామర్స్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

కామర్స్‌లో సత్తాచాటిన రమ్యకృష్ణ

బాగేపల్లి : ద్వితీయ పీయూ ఫలితాల్లో పట్టణంలోని నేషనల్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. సైన్స్‌లో 86శాతం, కామర్స్‌లో 91శాతం, ఆర్ట్స్‌లో 76శాతం ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ వెంకటశివారెడ్డి ప్రకటించారు. కామర్స్ విభాగంలో విద్యార్థిని రమ్యకృష్ణ 581 మార్కులతోనూ, సైన్స్ విభాగంలో మనోజ్ 584 మార్కులతో టాపర్‌గా నిలిచారు.



కాంగ్రెస్ గ్యారెంటీ కార్డుల ప్రచారంపై బీజేపీ ఫిర్యాదు

బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, దౌర్జన్యాలు చేస్తోందని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఫొటోలు ఉండే కార్డులను పంపిణీ చేస్తున్నారన్నారు. డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ, వివేక్‌సుబ్బారెడ్డిల నేతృత్వంలో ఎన్నికల కమిషన్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. దరఖాస్తు తరహాలో వివరాలు తీసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అశ్వత్థనారాయణ మీడియాతో మాట్లాడుతూ లక్ష రూపాయల వేతనం, రుణ మాఫీ, మహిళా న్యాయం పేరిట ఏడాదికి లక్ష, శ్రామిక న్యాయం పేరిట రోజుకు రూ.400, కులగణన చేశామనే వివరాలతో కార్డులు పంచుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక్కలిగ కులస్థుల తోపాటు సమాజంలోని అన్ని వర్గాలకు చెందినవారు అభిమానించే ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామీజీ పట్ల డీసీఎం డీకే శివకుమార్ అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశామన్నారు. తుమకూరు జిల్లా జేడీఎస్ కార్యకర్త మంజునాథ్‌పై కాంగ్రెస్‌కు చెందిన నాయకులు హత్యాయత్నం చేశారని, ప్రస్తుతం బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. కాంగ్రెస్ సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తోందని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. స్త్రీ శిశుసంక్షేమశాఖమంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ కోడ్ నిబంధనలు పాటించకుండా అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారని, అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ నేతల బృందం

బీజేపీ కార్యకర్తపై దాడి

బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్ తరపున ప్రచారానికి వెళ్లిన వ్యక్తిని కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేసి గాయపరిచారు. తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకా అంచేపాళ్యలో బుధవారం రాత్రి సంఘటన చోటు చేసుకుంది. కుప్పనహళ్ళి గ్రామ పంచాయతీ జేడీఎస్ సభ్యుడు మంజునాథ్‌పై స్థానిక కాంగ్రెస్ నాయకుడు బోరేగౌడ, అతడి అనుచరులు దాడి చేశారు. ఎన్నికల గురించి మాట్లాడాలంటూ పిలిపించి చాకుతో పొడిచారు. బాధితుడిని కుణిగల్ ఆసుపత్రికి తరలించారు. కుణిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



గాయపడిన మంజునాథ్



కసాపురం దేవస్థానంలో గురువారం రాత్రి లంకా దహన కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉగాది ఉత్సవాల ముగింపులో భాగంగా స్వామివారికి అభిషేకాలు, అలంకారాలు చేశారు.

అనంతపురం జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మురడి ఆంజనేయ స్వామి రథోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక భక్తులు విశేషంగా పాల్గొని స్వామికి మొక్కులు తీర్చుకున్నారు.



'వి-గార్డ్' నుంచి అరిజో వైర్లు

బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల రంగంలో దేశంలో పేరొందిన వి-గార్డ్ సంస్థ ఆధ్వర్యంలో అరిజో పేరిట వైర్స్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. నగరంలోని తాజ్ వెస్టెండ్‌లో వైర్‌లను లాంఛనంగా విడుదల చేశారు. దీంతోపాటు అడ్వాన్స్‌డ్ ఆఫరింగ్స్ సుపీరియో, ఎకో సేఫ్ వైర్స్ అండ్ ఎలగ్నా ఎంసీబీలను కూడా ఆవిష్కరించారు. ఎలక్ట్రికల్ వైరింగ్ టెక్నాలజీలో ఇది ఒక అద్భుతమైన ఆవిష్కరణగా సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. దేశంలో హౌసింగ్ వైర్స్ అండ్ కేబుల్స్ మార్కెట్ వృద్ధి చెందుతోందని 9-10శాతం పురోగతితో సుమారు 22-25వేల కోట్లు చేరుకోనుందన్నారు. అద్భుతమైన ఈ-బీమ్ ప్రాసెసింగ్ టెక్నిక్‌తో అరిజో వైర్స్ రూపొందించామన్నారు. 99.97 శాతం శుద్ధమైన రాగితో చేయబడిన అరిజో వైర్స్ జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించామన్నారు. ఈ వైర్‌లు దీర్ఘకాల మన్నిక వస్తాయన్నారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రామచంద్రన్ వెంకటరామన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మార్కెటింగ్ దీపక్ అగస్టిన్, బ్రాండ్ కమ్యూనికేషన్స్ వైస్ ప్రెసిడెంట్ అండ్ హెడ్ నందగోపాల్ నాయర్, శ్రీకుమార్, జయశ్, ఆంటోని, సూర్యప్రసాద్, విమల్ దీక్షిత్ పాల్గొన్నారు.



ఉత్పత్తుల ఆవిష్కరణలో సంస్థ ప్రముఖులు

రేపు 'మా తెలుగుతల్లి' ఉగాది వేడుకలు

బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాంస్కృతిక సాహిత్య సాంఘిక సేవా సంస్థ మాతెలుగుతల్లి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను శనివారం నిర్వహించనున్నారు. సర్జాపురలోని సెయింట్ ఫిలోమినా ఐసీఎస్ఈ స్కూల్ ఆడిటోరియం ఆధ్వర్యంలో వేడుకలు జరుపనున్నట్లు అధ్యక్షుడు ఉమామహేశ్వర రావ్ గురువారం మీడియాతో తెలిపారు. బెంగళూరులో నివసించే తెలుగు ప్రజలను ఉగాది ద్వారా ఐక్యం చేసేందుకు వేడుకలు జరుపుతున్నామన్నారు. విద్యఉద్యోగ, వ్యాపారాల కోసం బెంగళూరులో స్థిరపడిన తెలుగువారిని సంప్రదాయ ఉగాది వేడుకలలో భాగస్వాములు చేయదలచామన్నారు. ముఖ్యఅతిథిగా బెంగళూరు విశ్వవిద్యాలయం తెలుగు విభాగం హెచ్ఓడీ డాక్టర్ ఆశాజ్యోతి హాజరవు తారన్నారు. సెయింట్ ఫిలోమినా విద్యాసంస్థల కార్యదర్శి చంద్రయ్యనాయుడు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ యర్రాప్రగడ కస్తూరిబాయిలను సన్మానిస్తున్నామన్నారు. ఉదయం 10గంటలకు సంబరాలు ఆరంభమవుతాయని ఉపాధ్యక్షులు గద్వాల విశ్వకిరణ్ స్వాగతోపన్యాసం చేస్తారన్నారు. సంస్థ పరిచయ నివేదికను కార్యదర్శి ఇందిరాబెల్దే చేస్తారన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 8గంటల నుంచి గేట్ నంబర్ 2, నంది సిటాడెల్‌తో పాటు మున్నేకొలాల, గణేష్ గుడి, ఎఈసీఎస్ లేఅవుట్‌ల నుంచి ప్రత్యేక బస్సు సదుపాయం ఉందన్నారు. బెంగళూరులో నివసించే తెలుగువారంతా ఉగాది వేడుకలలో భాగస్వాములు కావాలని అధ్యక్షులు కోరారు.

కాంగ్రెస్‌వి అన్నీ ప్రగల్భాలే..

● కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రగల్భాలు పలుకుతోందని, కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే కనీసం 272మంది ఎంపీల మద్దతు అవసరమని, అయతే దేశమంతా అన్ని సీట్లలో కాంగ్రెస్ పోటీ చేయడం లేదని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొంది అధికారం చేపడుతుందని గొప్పలు చెబుతున్నారన్నారు. హుబ్బళ్ళిలో ఎన్నికల ప్రచారసభలో మాట్లాడిన ఆయన ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన స్థానాల్లో కనీసం పోటీ చేయడం లేదన్నారు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేంతటి శక్తి, అర్హత కాంగ్రెస్‌కు లేదన్నారు. ఇతర పార్టీలు, ఇండిపెండెంట్‌లను నమ్ముకున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అవినీతి లక్ష్యంగా కొనసాగించారన్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మించామని, శ్రీరాముడి ఆశీస్సులు తమకే ఉంటాయన్నారు. దేశంలో ఉగ్రవాద కలాపాలకు పాల్పడేవారికి రావణుడికి పట్టినగతే పడుతుందన్నారు. మలప్రభ నుంచి ఇంటింటికీ నీరు అందించే పైప్‌లైన్ పనులు సాగుతున్నాయని, మరో ఏడాదిలో ఈ పనులు పూర్తవుతాయన్నారు. దింగాలేశ్వర స్వామి రాజకీయ వ్యవహారంపై మాట్లాడేది లేదన్నారు. ఈనెల 15న నామినేషన్ వేస్తానని ప్రకటించారు.